

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముక్తుంపురానికి చెందిన కీర్తి (16) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కీర్తి కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ నెల 6న ఇంటి పనులు చేయకుండా, చదువుకోకుండా ఎప్పుడూ టివి చూసుకుని ఉంది. దీనిని గమనించిన తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆమె మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి మించి మృతి చెందింది. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హిరమండలం రిజర్వాయరు

**వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టుకు అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో అధికార మార్పిడి, రాష్ట్ర విభజన, నిర్మాణ సంస్థలు అర్ధాంతరంగా పనులు ఆపేయడం తదితర కారణాలతో ఆగుతూ, సాగుతూ వచ్చిన పనులకు తాజాగా మరో అడ్డంకి ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు పనులు 90 శాతానికి చేరుకోవడంతో వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి కావొచ్చని అధికారులు భావిస్తున్న తరుణంలో 87 ప్యాకేజీ నిర్మాణ సంస్థ పనులపై ఆసక్తి లేదని చేతులెత్తయేడం అధికారులను షాక్‌కు గురి చేస్తోంది. ఇందు కోసం సంబంధిత నిర్మాణ సంస్థ రాజకీయ ఒత్తిళ్లు సాగిస్తున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే ప్రాజెక్టు పనులు మరింత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వపరమైనా లోపాలూ ప్రాజెక్టుకు శాపంగా మారాయి. రిజర్వాయరు పనులకు బిల్లులు చెల్లించకపోవడం, భూసేకరణ అధికారుల ఉదాసీన వైఖరితో రైతులకు డబ్బులు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.**

# అడుగడుగునా ఆటంకాలే

- **పనుల క్లోజింగ్‌కు 87 ప్యాకేజీ నిర్మాణ సంస్థ యత్నం**
- **రూ.26.07 కోట్ల మేర బిల్లులు చెల్లించని ప్రభుత్వం**
- **నిధులు ఉన్నా... చెల్లించని భూసేకరణ అధికారులు**
- **వచ్చే జూన్ నాటికి 'వంశధార' పూర్తిపై నెలకొన్న సందేహాలు**

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టు పనులు ఒక అడుగు ముందుకు, రెండడుగుల వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.933.90 కోట్లతో మూడు నిర్మాణ సంస్థలతో పనులను ప్రారంభించింది. ప్రాజెక్టు పనులను 87,88 ప్యాకేజీలు, హిరమండలం రిజర్వాయరు పనులుగా విభజించారు. 87 ప్యాకేజీ పనులను హర్విన్ కనస్ట్రక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు, 88 ప్యాకేజీ పనులను శ్రీనివాస కనస్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు, హిరమండలం రిజర్వాయరు పనులను సోమ-పటేల్ కంపెనీకి అప్పటి ప్రభుత్వం అప్పగించింది. పాత ఏజెన్సీలే ఇప్పటికీ పనులు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం 87 ప్యాకేజీ పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.173.63 కోట్లు కాగా, ఇప్పటివరకు 124.87 కోట్లు ఖర్చు చేశారు. 88 ప్యాకేజీ పనులు 96 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.195.15 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.156.83 కోట్లు ఖర్చు చేశారు. వివిధ కారణాలతో పనులు సకాలంలో చేపట్టకపోవడంతో ఆరు నెలల కొకసారి పొడిగించారు. పనులు పూర్తి చేసేందుకు వచ్చే ఏడాది జూన్ వరకు గడువు విధించారు.

**చివరి దశకు రిజర్వాయరు పనులు**

హిరమండలం రిజర్వాయరు పనులు అంచనా వ్యయం రూ.419.03 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.414.69 కోట్లను వెచ్చించారు. రిజర్వాయరు పూర్తికి అనేక పర్యాయాలు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా ఏనాడూ అనుకున్న సమయానికి పూర్తికాలేదు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో అప్పటి నుంచి ఆరు మాసాలు చొప్పున పొడిగిస్తూ వచ్చారు. ఇప్పటివరకు 96 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం మరోసారి గడువు నిచ్చింది.

**భూసేకరణ అధికారుల ఉదాసీనత**

87,88 ప్యాకేజీ పనుల పూర్తికి భూసేకరణ బిల్లుల చెల్లింపే ప్రధాన అడ్డంకిగా ఉన్నట్టు తెలుస్తోంది. 87 ప్యాకేజీ పనుల పూర్తికి 69 ఎకరాలు కావాల్సి ఉంది. వీటి కోసం రూ.8.84 కోట్లను చెల్లించాల్సి ఉంది. అదే విధంగా 88 ప్యాకేజీ పనులకు పూర్తికి 28.45 ఎకరాలు కావాల్సి ఉంది. ఇందు కోసం రూ.3.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. భూసేకరణకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు అందుబాటులో ఉన్నా భూసేకరణ అధికారుల తీరుతో నిలిచిపోయినట్టు తెలుస్తోంది. బిల్లుల అప్‌లోడింగ్ చేయకుండా జాప్యం చేయడంతో పనులు ముందుకు సాగడం లేదని సమాచారం.

**రూ.26.07 కోట్ల మేర పెండింగ్ బిల్లులు**

వంశధార ప్రాజెక్టు పనులు చేస్తున్న నిర్మాణ సంస్థలకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని తెలుస్తోంది. హిరమండలం రిజర్వాయరు పనులు చేపడుతున్న సోమా-పటేల్ సంస్థకు రూ.26.07 కోట్ల మేర బిల్లులు బకాయి పడినట్టు తెలుస్తోంది.

**87 ప్యాకేజీ పనులపై నిలినీడలు**

ప్రాజెక్టు ప్రారంభం నుంచి 87 ప్యాకేజి పనులను హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్సు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థే చేపడుతోంది. పని ఒప్పందం విలువ రూ.173.41 కోట్లుగా ఇప్పటి వరకు ఆ నిర్మాణ సంస్థకు ప్రభుత్వం రూ.127.88 కోట్లను చెల్లించింది. 80 శాతం మాత్రమే పనులు జరిగాయి. పనులపై ఆసక్తి లేదని, ఒప్పందం ముగించాలని కోరుతున్నట్టు తెలిసింది. బిజెపి ఎంపీ సిఎం రమేష్‌కు చెందిన సంస్థ కావడంతో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సి ఉంది. ఎంపీ పైరవీలతో పనులు రద్దయితే మాత్రం ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకోనుంది.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

## మిల్లర్లు అదనపు ధాన్యం డిమాండ్

- **'మీకోసం'లో ఫిర్యాదు చేసిన ఎపి రైతు సంఘం నాయకులు**
- **169 ఫిర్యాదుల స్వీకరణ**

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు అదనపు ధాన్యం డిమాండ్ చేస్తున్నారని, దీంతో రైతులు నష్టపోతున్నారని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పొందూరు చంద్రరావు, వెలమల రమణ, కార్యదర్శి పోలాకి ప్రసాదరావు తెలిపారు. జెడ్‌పిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన మీకోసంలో ఫిర్యాదు చేశారు. మొత్తం ఆఫ్‌లైన్, ఆన్‌లోన్‌లో 169 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మిల్లర్లు రెండు నుంచి ఐదు కిలోలు వరకు బస్తాకు రైతులు నుంచి అదనపు ధాన్యం కోసం డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. 50 నుంచి 100 బస్తాలకు అమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నాలుగు లక్షలు మంది రైతులు ఈ సమస్య ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు ఆర్థిక ప్రయోజనం ఆధారంగా మిల్లర్లకు లక్ష్యాలు విధిస్తున్నారని పోలాకి మండలం సుసరాంకు చెందిన శ్రీ దుర్గామోడ్రన్ రైసు మిల్లు యజమాని తమ్మిని భూషణరావు ఫిర్యాదు చేశారు. 2025-26 ఏడాదిలో 15,155 క్వింటాళ్లకు అనుమతులు ఇచ్చారని, 2024-25 తమ కొనుగోళ్ల మేరకు 26326 క్వింటాళ్ల టార్కెట్ ఇవ్వాలని అన్నారు. ఆమదాలవలస నియోజక వర్గానికి చెందిన సువ్వారి గాంధీ పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. రబీలో అవసరం మేరకు ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ప్రధానమంత్రి అవాస యోజన లబ్ధిదారులు ఎంపికలో అమదలవలస నియోజకవర్గంలో రాజకీయ జోక్యంతో జరిగిందన్నారు. విచారణ నిర్వహించి అర్హులను గుర్తించి ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాల కోరారు. కొంచాడ, లుట్టపేట, యాగాటిపేట గ్రామాలకు రోడ్లు నిర్మించాలన్నారు. ఆమదలవలస మండలంలో నిమ్మతొర్లాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. అర్హులకు కొత్త సామాజి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎచ్చెర్ల మండలం కొంగరాం పంచాయతీని విభజిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని నక్క లక్ష్మణరావుతో కూడిన బృందం కోరింది. పెద్దకొంగరాం, చిన్నకొంగరాం విభజించాలని కోరారు. రిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కోసం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించారని, ప్రస్తుతం పోస్టులు తీయడం లేదని రాంబాబు వినతిపత్రం అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. జిల్లాలో హెల్త్ సెక్రటరీలు 605 మంది ఉన్నారని, 154 ఎఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హత, సీనియారిటీ మేరకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ఎచ్చెర్ల మండలానికి చెందిన టిడిపి నాయకులు పంచిరెడ్డి కృష్ణారావు, వావిలపల్లి రామకృష్ణ, పైడి అన్నంనాయుడు పలు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ నుంచి పసువులు వచ్చి కుశాలపురంలో పంటలు నాశనం చేస్తున్నాయని, పొన్నాడలో పశువైద్య శాఖ నిర్మించాలని అన్నారు. నాగావళి నది కోత నియంత్రణకు గ్రోయన్లు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలో ఇళ్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సంధ్య కోరింది. ఎస్.ఎం.పురంలో పిఎసిఎస్ భవనానికి స్థలం కేటాయించాలని, భవనం నిర్మిస్తామని డిసిఎంఎస్ చైర్మెన్ చౌదిరి అవనాష్ కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, పలాస ఎయిర్ ఫోర్టు ప్రత్యేక అధికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

## స్వచ్ఛ మున్సిపాలిటీయే లక్ష్యం

**ఎమ్మెల్యేలు రవికుమార్, శంకర్**

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వచ్ఛ మున్సిపాలిటీయే తన లక్ష్యమని ఎమ్మెల్యేలు కూన రవికుమార్ గొండు శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1,6,7,21 వార్డుల పరిధిలోని తిమ్మాపురం, మన్నయ్యపేట, నందగిరిపేట, చింతాడ, కుద్దిరాం ప్రాంతాల మురుగునీరు శుద్ధి కేంద్రాలకు రూ.166.12 లక్షల నిధులతో సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా శుద్ధి కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మురుగునీరును శుద్ధి చేసి వినియోగించుకునే విధంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మురుగు శుద్ధి కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టి ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, మున్సిపల్ మాజీ చైర్మన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, బోర గోవిందరావు, బోయిన సునీత పాల్గొన్నారు.

## విత్తన చట్టం రద్దు చేయాలి




పలాస : పత్రులను చేతబట్టి నిరసన తెలుపుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- పలాస

ఫెడరల్ హక్కులను అణగదొక్కే, ఆహార భద్రత, విత్తన స్వావలంబనను నాశనం చేసే సీడ్స్ బిల్-2025ను, అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బలవంతంగా బిగించడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తెప్పల అజయ్ కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని మాకన్నపల్లి సచివాలయం వద్ద సోమవారం ముసాయిదా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన చట్టం సీడ్స్ బిల్ ముసాయిదా, పాత సీడ్స్ యాక్టు 1966 స్థానంలో కొత్త చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన సీడ్స్ బిల్‌ను తీవ్రంగా ఖండిస్తూ, ఇది భారత విత్తన రంగంపై బహుళజాతి సంస్థల కార్పొరేట్ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి తీసుకొచ్చిన ప్రతికూల చట్టమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌకగా నాణ్యమైన విత్తనాలను సమయానికి సరఫరా చేస్తామని, ఇందులో ఎలాంటి గ్యారెంటీ లేదని అన్నారు. ఆహార భద్రత, రైతుల ఆర్థిక భద్రత లాభదాయకమైన వ్యవసాయం అనే భావనకు విఘాతం కలుగుతుందన్నారు. రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక 2025 విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సైన దేశయ్య, రాపాక చిన్నారావు, బి.ప్రసాదరావు, బి.దుర్యోధన, టి.రాజు, జె.కొండలరావు, ఎం.అప్పలస్వామి, బి.వీరస్వామి, జి.నీలకంఠం, బి.మాధవరావు, మహిళా రైతులు బత్తిని చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల :** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్, రైతు చట్టాలు 2025 వ్యతిరేకిస్తూ మండలంలోని చిలకపాలెం, చిన్నకొంగరాం గ్రామాల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించి వాటి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు మాట్లాడుతూ సీతాకాలం సమావేశాల్లో తీసుకొస్తున్న విద్యుత్, విత్తన చట్టాలు 2025 వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఈ చట్టాల వల్ల రైతులు స్వతంత్ర్య కోల్పోతారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పొందూరు చంద్రరావు, జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, తొనంగి నందివాడు, సూరమ్మ అప్పన్న, నక్క వైకుంఠరావు, లక్షణ రాములు, కొయ్యల శ్రీరాములు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు :** కేంద్ర ప్రభుత్వం తెస్తున్న విత్తన చట్టం రద్దు చేయాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్ల పేరిట ఆదాని కంపెనీకి లాభాలు తెచ్చి పెట్టి రైతులను మోసం చేసే చట్టాలను విరమించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎంపల కామేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని చీపురుపల్లి పంచాయతీ కొండపల్లిలో సీడ్స్ బిల్ ప్రతులను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను మోసం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ యూత్ అధ్యక్షులు ఎం.తేజ, డి.మోమనరావు, తరుణ్, రమణారావు తదితరులు పాల్గొన్నారు




ఎచ్చెర్ల : మాట్లాడుతున్న ప్రసాదరావు



వజ్రపుకొత్తూరు : నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు



## మంత్రి అసమర్థతతోనే విమాన రంగం పతనం

**మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**

ప్రజాశక్తి- ఆమదాలవలస

విమానయాన రంగం పతనం కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అసమర్థతే కారణమని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రోజుకు వెయ్యి విమానాలు రద్దయ్యి దేశ వ్యాప్తంగా ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత మంత్రిత్వశాఖ పరిస్థితిని ముందే అంచనా వేయలేకపోవడం ఘోర నిర్లక్ష్యమని మండిపడ్డారు. ఇది యాదృచ్ఛిక సమస్య కాదని, పూర్తిగా నిర్వాహక వైఫల్యమని మండిపడ్డారు. రామ్మోహన్ నాయుడుకు నిర్వహిస్తున్న శాఖపై పాట్టు, అవగాహన లేకపోవడం వంటివి ఈ సంక్షోభానికి కారణాలని అన్నారు. డిజిసిఎలో 53 శాతం వరకు పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయని, బిసిఎఎస్, ఎఎఐలోనూ సిబ్బంది కొరత ఏర్పడటం విమానయాన సంస్థ పనితీరుకు నిదర్శనం ఎద్దేవా చేశారు.

## సోంపేటలో భారీ దొంగతనం

**30 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీ**



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట పట్టణంలోని కోర్టుపేట వీధిలో ఆదివారం రాత్రి జరిగిన బంగారం దొంగతనం స్థానికంగా తీవ్ర కలకలం రేకెత్తించింది. బాధితులు, సోంపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తంగుడు మనోజ్, భార్య, పిల్లలతో కలిసి స్థానిక కోర్టుపేట వీధిలో నివసిస్తున్నాడు. ఆదివారం ఉదయం సోంపేటలో శుభ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం భార్యతో కలిసి మరో కార్యక్రమంలో హాజరయ్యేందుకు బరంపురం వెళ్లాడు. అక్కడ నుంచి సాయంత్రం ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి వస్తుస్తున్నారు. ఇచ్ఛాపురం సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వేరొక వ్యక్తి ఢీకొనడంతో మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అక్కడే ప్రథమ చికిత్స చేయించుకున్న ఆయన నెమ్మదిగా సోంపేట స్వగృహానికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన తర్వాత మనోజ్ సక్రమంగా మాట్లాడకుండా, ఏవేవో మాటలు మాట్లాడటం, గుర్తు లేనట్లు ప్రవర్తించడంతో భార్య వెంటనే అతడి స్నేహితుడికి తెలియజేసి ఆర్ఎంపి వైద్యులను రప్పించారు. చికిత్స అందిస్తున్న సమయంలో పిల్లలు భయపడుతుండడంతో పక్క వీధిలో ఉన్న మనోజ్ సోదరుడు శ్రీను ఇంటికి కుటుంబ సభ్యులంతా వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి అక్కడే ఉండి సోమవారం ఉదయం పిల్లలను స్కూల్‌కు పంపించేందుకు తిరిగి ఇంటికి వచ్చారు. తమ ఇంటి గేటుకి వేసిన తాళం చూసి మనోజ్, అతడి భార్య ఆందోళన చెందారు. అది తాము వేసిన తాళం కాదని గుర్తించి దాన్ని పగలగొట్టి ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించారు. బీరువా తెరిచి చూడగా అందులో తాము దాచి పెట్టుకున్న సుమారు 30 తులాల బంగారం, రూ.లక్ష వరకు నగదు కనిపించడం లేదు. దీంతో లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం అందజేశారు. సిఐ మంగరాజు, ఎస్ఐ లవరాజు, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు వచ్చి ఆధారాలు సేకరించారు. తాము ఎప్పుడూ పెట్టే చోటే బీరువా తాళాలు పెట్టామని, బీరువా తీసి లోపల ఉన్న బంగారం, నగదును తీసుకొని తిరిగి యథా స్థానంలో తాళాలు పెట్టడం చూస్తే, ఎవరో బాగా తెలిసిన వ్యక్తులే ఇది చేసి ఉంటారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. బీరువాలో ఉన్న బంగారం, నగదును మాత్రమే తీసుకున్నారని, పక్కనే ఉన్న వెండి వస్తువులు అలాగే ఉంచేశారని తెలిపారు. ఎస్ఐ లవరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బాల్య వివాహాలు వద్దు

**కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. జడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం నేరంగా చెప్పారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమన్నారు. బాలికల వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. 'నా కుటుంబం, నా పరిసరాలు, నా గ్రామం, సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని' అన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియజేయాలన్నారు. బాలల విద్య, భద్రత కోసం నాగళాన్ని వినిపించాలని చెప్పారు. బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇస్తాననే ప్రతిజ్ఞ చేశారు. గ్రామం యూనిట్‌గా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు నియంత్రణ కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు


వృద్ధురాలి సమస్య వింటున్న ఎస్పి మహేశ్వరరెడ్డి

## ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

### ఎస్పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో స్వీకరించే ప్రజా ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి పొందేలా బాధితులకు న్యాయం చేయాలని ఎస్పి కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో 62 మంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌కాల్ (జూమ్ కాన్ఫరెన్స్) ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియపరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులు ఆదేశించారు.


పొందూరు : నిరసన తెలియజేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు

## పిఎసిఎస్ ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులకు 2019, 2024 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను అమలు చేయాలని రాష్ట్ర పిఎసిఎస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎర్నేన పాపినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు మండల కేంద్రంలోని డిసిసిబి కార్యాలయ ఆవరణలో సోమవారం పొందూరు, జి.సిగడాం, బాతువ పిఎసిఎస్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎసిఎస్‌లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు అమలయ్యే ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లతో పాటు గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేసి చట్ట ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమాను కల్పించడంతో పాటు సర్వీస్‌లో మరణిస్తే అటువంటి ఉద్యోగికి రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను చేసి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిసిసిబి మేనేజర్ సౌజన్యకు అంద జేశారు. కార్యక్రమంలో బాతువ పిఎసిఎస్ సిఇఒ జి.లక్ష్మణరావు, పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి :** వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోటబొమ్మాళి సహకార సంఘ సిఇఒ సత్యం, సంతబొమ్మాళి సహకార సంఘం సిఇఒ ఇచ్ఛాపురం మాధురి ఆధ్వర్యాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

## గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

**అరసవల్లి:** కేంద్ర గ్రంథాలయంలో ఈశ్వర్ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, డాన్స్ పోటీలు నిర్వహించారు. అదే విధంగా టీవీ చానల్స్ పనితీరు, దేశ పురోగతితో వాటి ముంద డుగు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిజెపి స్కూల్, అమర్ కౌమర్తి స్కూల్ రెండు బ్రాంచ్‌లు, తిరుమల స్కూల్, విజ్ఞాన్ స్కూల్, గీతాంజలి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మంగళవారం బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని ఈశ్వర్ ఆర్ట్స్ ప్రతినిధి షోడవరం ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి, వివిధ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


ధ్రువపత్రాలు అందజేస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- లావేరు

ప్రతీఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తహశీల్దార్ గురుగు బిల్లి ఈశ్వర శ్రీనువాసరావు అన్నారు. లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ 50వ జన్మదినం సందర్భంగా సోమవారం లావేరులో టిడిపి మండల నాయకుడు కడుపుకుట్ల రమణబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, నేత్రవైద్య శిబిరాన్ని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాతతో కలిసి తహశీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాడానికి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారు రక్తం లేక ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, అటువంటి వారి ప్రాణాలను కాపాడేందుకు ఇటువంటి రక్తదాన కార్యక్రమలు చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా 22 మంది రక్తదానం చేశారు. నేత్రవైద్య శిబిరంలో 102 మందికి వైద్య పరీక్షలు చేయగా 15 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పేడాడ వెంకటరాజు, రక్తదానం కో-ఆర్డినేటర్లు సత్యనారాయణ, పెంకి చైతన్య, రమణ, నేత్రవైద్య శిబిరం కో-ఆర్డినేటర్లు సాయికుమార్, ప్రజాప్రతినిధులు కలిశెట్టి భాస్కరరావు, బాడిత లక్ష్మణరావు, చిట్టిబాబు, గంట్యాడ మహేష్, శాంతారెడ్డి, గండి సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'ఉదయం పోషకాహారం'

### ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ఉదయం ఆకలిని తీర్చేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్ చేపట్టిన 'ఉదయం పోషకాహార కార్యక్రమం' అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం కిష్టప్పపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలామంది పిల్లలు ఉదయం అల్పాహారం తినకుండా పాఠశాలకు వస్తున్నారని, వారి కోసం అక్షయపాత్ర పౌష్టికాహారాన్ని అందించడం శుభపరిణామమన్నారు. అనంతరం స్వయంగా విద్యార్థులకు పోషకాహారాన్ని (చిరుధాన్యాలతో చేసిన చిక్కీలు, వేరుశెనగలు, ప్రోటీన్ బార్) పంపిణీ చేశారు. శ్రీకాకుళం, గార మండలాల్లోని దాదాపు 14 వేల మంది విద్యార్థులకు దీనివల్ల మేలు జరుగుతుందన్నారు. వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శనివారాల్లో) ఈ ఆహారాన్ని అందిస్తారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎంఇఒలు నక్క రామకృష్ణ, మురళీకృష్ణ, హెచ్ఎం సాయిసంధ్య, సర్పంచ్ సత్యవతి, అక్షయపాత్ర రీజినల్ మేనేజర్ రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు చిక్కీలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## యువతకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలి

### రజక కార్పొరేషన్ డైరెక్టర్ రాము

ప్రజాశక్తి- రణస్థలం

రజక యువతీ, యువకులకు సబ్సిడీపై ప్రభుత్వం రుణాలు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లను ఆయా కుల సంఘాల నాయకులతో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సత్యనారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గురజాపు రాము మాట్లాడుతూ రజకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బాగా వెనకబడి ఉన్నారని, రజకులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే జిల్లా అభివృద్ధి రజక కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో దోబీ పనులకై, దేవాలయాల్లో ఉద్యోగాలు, కాంట్రాక్టర్లు రజకులకే కేటాయించాలన్నారు. 50 ఏళ్ళు నిండిన రజక వృత్తిదారులకు పింఛను మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలో రజక సామాజిక భవనాన్ని ఏర్పాటు చేయాలని, రజక యువతి యువకులకు మోడ్రన్ యంత్రాలపై ధోబి శిక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సోపేటి రామారావు, ధర్మవరపు శంకర్, దామర్ సింగ్, మహాలక్ష్మి, నౌపడ రామారావు, తామాడ ప్రసాద్ తదితరులున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రాము

## దేశ ప్రతిష్టను దిగజార్చిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు


ఆమదాలవలస : మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

గడచిన కొన్ని రోజులుగా దేశంలోని విమానాశ్రయాల్లో దేశ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి దుస్థితి తీసుకువచ్చి దేశ ప్రతిష్టను దిగజార్చిన ఘనుడు కేంద్ర విమానయాన శాఖ మంత్రి, జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడే కారణమని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అతి పిన్న వయసులో కేంద్రమంత్రి పదవి చేపట్టారని, దీనివలన ఉత్తరాంధ్రకు, జిల్లాకు మంచి పేరు తీసుకువస్తారని ఆశించినప్పటికీ వాటిని తుంగలో తొక్కారన్నారు. జాతీయస్థాయి మీడియాలో ముందుచూపు, అవగాహన లేని అసమర్థ మంత్రిగా కథనాలు ప్రసారం చేస్తూ రీల్స్, మీమ్స్ పబ్లిసిటీ చేసుకునే వ్యక్తిగా నిలిచారని ఎద్దేవా చేశారు. ఇండిగో విమానయాన సంక్షోభంపై పిఎం అధ్యక్షతన నిర్వహించిన హై లెవెల్ సమావేశానికి కేంద్ర విమానయాన శాఖ మంత్రిని పిలవకపోవడం సిగ్గుచేటని, జనవరి 8, 2024లో డిజిసిఎ కొన్ని రెగ్యులేషన్స్ తీసుకువచ్చిందని, పాసెంజర్ సేఫ్టీ, పాసెంజర్ స్టాండర్డ్‌ను ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకువెళ్లడం, ఫ్లైట్ సిబ్బంది పనిగంటలు తదితర 22 అంశాలపై నవంబరు 1 నుంచి డిజిసిఎ ఇంప్లిమెంటేషన్ చేస్తుందని తెలిపారు. గతంలో పైలెట్లకు వారం రోజులకు 36 గంటలు విశ్రాంతి సమయం ఉండేదని, దానిని 48 గంటలకు పెంచడం జరిగిందని ఇదంతా ఫైలెట్లపై ఒత్తిడి లేకుండా చేయడానికి ఈ సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనివలన ఇండిగో విమాన సంస్థకు అదనపు పైలెట్లు, సిబ్బంది రిక్రూట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ అంశాలను పట్టించుకోకుండా నూతన సంస్కరణలు అమలు చేయడంతో ఇండిగో సంస్థ విమానాలను తిప్పలేక చేతులెత్తేసిందన్నారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను జిఎంఆర్ సంస్థకు అప్పజెప్పడం జరిగిందని, భోగాపురం ఎయిర్‌పోర్ట్ వద్దకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెళ్లి రీల్స్ చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కింజరాపు కుటుంబం రాష్ట్ర, కేంద్రస్థాయి పదవులు అనుభవిస్తూ జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇందారపు గోవిందరావు, బొడ్డేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి

**నరసన్నపేట:** ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని వైసిపి పోలాకి జెడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇండిగో విమాన సర్వీసులు ఆకస్మికంగా రద్దు కావడంతో లక్షలాది మంది ప్రయాణికులు ఎయిర్ పోర్టుల్లో పడిగాపులు కాస్తున్నారన్నారు. దీనిపై సంబంధిత శాఖ మంత్రి నోరు మెదపకపోవడం దారుణమన్నారు. రామ్మోహన్ నాయుడు పనితీరు ప్రధాని మోడీకి కూడా అర్థమైందన్నారు. అందుకే ఇండిగో వ్యవహారాన్ని పిఎంఒ నేరుగా పర్యవేక్షిస్తోందన్నారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి


సాయి (ఫైల్)

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని తాటిపర్తి పంచాయతీ గోపాలపురానికి చెందిన మన్యాల సాయి (24) నరసన్నపేట మండలం చోడవరం సమీపంలో వంశధార కాలువులో పడి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు మృతుడు సాయి గొర్రెల వ్యాపార నిమిత్తం ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి చోడవరానికి చెందిన పలువురు గొర్రెల వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకొచ్చేందు వెళ్లాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు మన్యాల అప్పన్న, సావిత్రమ్మలతో, బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి చేరుకొని పోలీసుల సమక్షంలో మృతదేహన్ని బయటకు తీసుకువచ్చారు. వృద్ధులైన తల్లిదండ్రులు గొర్రెలు కాసుకొని జీవనం సాగిస్తున్నారు. చేతికందిన కుమారుడు మృతి చెందాడని వార్త తెలుసుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు తమ్ముడు చరణ్‌లు ఉన్నాడు. అందరిలో కలిసిమెలిసి సంతోషంగా ఉండే సాయి మృతి చెందాడన్న విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## వ్యక్తికి గాయాలు


కొట్లాడుతున్న పారిశుధ్య కార్మికులు

**కోటబొమ్మాళి:** కోటబొమ్మాళిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఇరువురు స్థానిక పాతబస్టాండ్ సమీపంలో సోమవారం కొట్లాటకు దిగారు. దాని ఫలితంగా హడ్కో కాలనీకి చెందిన పడాల తులసీరావు గాయాలు పాలయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు.


ధర్నా నోటీసు అందజేస్తున్న అంగన్వాడీలు

## 12న కలెక్టరేట్ వద్ద ధర్నా

**పలాస:** అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, అన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని, యాప్‌లన్ని ఒకే యాప్‌గా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న కలెక్టరేట్ వద్ద చేపడుతున్నామని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి తెలిపారు. ఈ మేరకు పలాస ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం పిఒ పార్వతికు ధర్నా నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు బి.సునీత, నాయకులు డి.సునీత, ఆర్.అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మురళీప్రకాష్


మురళీప్రకాష్


జానకిరావు

**కవిటి:** యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎం.మురళీప్రకాష్ మరోసారి ఎన్నికయ్యారు. మెళియాపుట్టి మండలం చాపరలో యుటిఎఫ్ 41వ జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శిగా మురళీప్రకాష్, ఆడిట్ కమిటీ మెంబర్‌గా కవిటి మండలానికి చెందిన జి.జానకిరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు ఇరువురిని మండలంలోని ఉపాధ్యాయులు అభినందించారు.

### గణపతిరావు...

**సంతబొమ్మాళి :** యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మండలానికి దేవాది గణపతి రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెళియాపుట్టిలో నిర్వహించిన 41వ యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈయన గతంలో సంతబొమ్మాళి యుటిఎఫ్ మండల కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎర్నాగుల సింహాచలం, ప్రధాన కార్యదర్శి గౌడు మోహనరావు, గౌరవాధ్యక్షుడు కానూరు ఆనందరావు, మండల పూర్వ అధ్యక్షుడు కుసుమూరు పాపారావు శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

## 'కార్గో'కు సెంటు భూమి ఇవ్వం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కార్గో ఎయిర్ పోర్టుకు సెంటు భూమినీ ఇచ్చే ప్రసక్తి లేదని కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొమర వాసు, జోగి అప్పారావు తెలిపారు. మండలంలోని వంకులూరు సామాజిక భవనంలో సమావేశం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎయిర్ పోర్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు, పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన మాటలని బాధిత రైతులు తరుపున ఖండిస్తున్నామన్నారు. పచ్చని ఉద్దానం పల్లెల్లో గత 14 నెలలుగా కార్గో ఎయిర్ పోర్టు వద్దని, మా పచ్చని పంట భూములని ప్రభుత్వానికి ఇచ్చేది లేదని తేల్చి చెప్పామన్నారు. పోరాటం చేస్తున్నా సరే రైతుల ఆవేదనను అర్థం చేసికోకుండా ఇంకా మమ్మల్ని రెచ్చ గొట్టడం సరైన పద్ధతి కాదన్నారు.

కలెక్టర్ నుంచి గ్రామస్థాయి అధికారులు వరకు బాధితులు తరుపున నేరుగా కలిసి కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం మాకొద్దని, ఒక్క సెంట్ భూమీ ఇచ్చేది లేదని వినతిపత్రం సమర్పించినా అధికారులు వాస్తవాన్ని మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. భూములు ఇవ్వమని బాధిత రైతులు పోరాటం చేస్తుంటే అధికారులు మార్కెట్ కన్నా రెట్టింపు ధరలు ఇస్తామనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో లండ రామస్వామి, గుంటు రామారావు, గుంటు లోకనాథం, గుంటు జోగారావు, లండ చక్రపాణి, పురుషోత్తం పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పోటీలకు వరలక్ష్మి ఎంపిక


వరలక్ష్మి

**బూర్జ:** జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు పిఎల్‌దేవి పేట గ్రామ విద్యార్థిని చింతాడ వరలక్ష్మి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, పిఇటి అప్పన్న సోమవారం తెలిపారు. నవంబర్ నెలలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో 400 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిందని తెలిపారు. 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ జిఎన్‌సిటి ఈనెల 12 నుంచి 17 వరకు జరగనున్న స్విమ్మింగ్ పోటీలకు వరలక్ష్మి ఎంపికైందని తెలిపారు. పాలకొండ పట్టణంలోని కేశవసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న వరలక్ష్మి నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## చిన్నారుల భద్రతపై దృష్టి

ప్రజాశక్తి- కవిటి



అవగాహన చిత్రం

చిన్నారుల భద్రత, భవిష్యత్, విద్యపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, అందులో భాగంగా అవగాహన చిత్రాలు వేస్తున్నట్టు ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.రాజేశ్వరి అన్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలోని ముఖ్య కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల గోడలపై 'భేటీ బచావో - భేటీ పడావో' సందేశంతో పాటు 18 ఏళ్లు నిండకుండానే అమ్మాయిలకు వివాహం చేయడం నేరమని ఈ గోడ చిత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు ఆమె తెలిపారు.

## అపరాధ రుసుం వసూలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు మండలంలో సోమవారం నిర్వహించిన వాహనాలు తనిఖీలో వాహన చోదకులు నుంచి రూ.1.60 లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు. మద్యంతాగి వాహనాలు నడపడంతో 16 మంది నుంచి అపరాధ రుసుం వసూలు చేశామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగిన 12 మంది నుంచి రూ.12 వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

## క్రీడలకు పెద్దపీట

### ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపేట వేస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయిలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. డిప్యూటీ విద్యాశాఖ అధికారి పి.విలియమ్స్ మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సమావేశంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్‌రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మణి చంద్రప్రకాశ్, పిఎసిఎస్ అధ్యక్షుడు పెద్దిన బాబ్జీ, దక్కత ఢిల్లీరావు, టిడిపి అధ్యక్ష,కార్యదర్శులు పత్రీ తవిటియ్యా, నందిగాం కోటి, ఎంఇఒ అప్పారావు, ఎస్.విశ్వనాథ్, ఎంపిడిఒ ప్రభాకరరావు, తహశీల్దార్ వెంకటరావు, పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : పోటీలను ప్రారంభిస్తున్న విప్ అశోక్

**ఆమదాలవలస :** విద్యార్థి దశనుంచే క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న 69వ అంతర పాఠశాల గ్రిగ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, డాక్టర్ చాపర సుధాకర్, బోర గోవిందరావు, సనపల ఢిల్లీశ్వరరావు, సంపదరావు మురళి, నాగళ్ల మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.



దుస్తులను పంపిణీ చేస్తున్న బాబూరావు

## దుస్తుల పంపిణీ

ప్రజాశకి- పలాస

పలాస మదర్ థెరీసా పాఠశాలలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు తండ్రి వజ్జ సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబూరావు, మదర్ థెరీసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని మాట్లాడుతూ ఏటా సూర్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం, దుస్తులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సూర్యనారాయణ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టేవారని, తాము కూడా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ఆర్.ప్రసాదరావు, జోగారావు కూర్మారావు, పిట్ట లక్ష్మణరావు, ఎస్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పేదల గూడు.. గడువు పెరిగింది చూడు

### 14 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- బూర్జ

పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంలో భాగంగా ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి గృహాలు పూర్తిచేయడానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అదనంగా రూ.50 వేలు, రూ.75 వేలు అందించారు. కొత్త గృహాల కోసం దరఖాస్తులు చేసుకుని వారు వస్తూనే ఉన్నారు.

### దరఖాస్తుకు ఇవి తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం లేదా పట్టా ఉండాలి. తెల్లరేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్ జిరాక్స్‌లు సమర్పించాలి. గతంలో ఇల్లు మంజూరై ఉంటే ఈ పథకం వర్తించదు. అర్హులైన పేదలు పిఎంఎవై కింద పక్కా గృహానికి దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 14 వరకు అవకాశం ఉందని గృహ నిర్మాణశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్ తెలిపారు.

### యాప్‌లో నమోదు

సొంత స్థలం లేదా ఇంటిపట్టా కలిగి ఇల్లులేని వారి వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న మహిళ ప్రస్తుతం ఉన్న ఇల్లు నిర్మాణం చేపట్టే స్థలం వద్ద ఫోటోలు తీసి అప్లోడ్ నమోదు చేస్తున్నారు. పిఎంఎవై కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాలకు రూ.1.80, పట్టణాల్లో రూ.2.50 లక్షలు కేటాయించారు.


పిఎల్‌దేవిపేటలో గృహనిర్మాణ సర్వే చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్


క్రీడా బృందంతో విసి రజని

## వాలీబాల్ పోటీలకు వర్సిటీ బృందం

**ఎచ్చెర్ల:** కాకినాడ జెఎన్‌టియులో ఈ నెల 10 నుంచి జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ (పురుషుల) పోటీలకు డా.బిఆర్ఎయు క్రీడాకారుల బృందాన్ని ఎంపిక చేశారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థుల నుంచి 16 మంది ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14 వరకూ కొనసాగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడా బృందాన్ని వర్సిటీ విసి ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్యలు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డా.పి.రవికుమార్, క్రీడా కార్యదర్శులు డా.ఎం.శ్రీనువాస్, ఎ.భాస్కర్ పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న సర్పంచ్ సురేష్

## ఎం.ఎస్ పల్లిలో సంతకాల సేకరణ

**కంచిలి:** మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని ఎం.ఎస్.పల్లిలో సర్పంచ్, వైసిపి నాయకులు కొనపల సురేష్ ఆధ్వర్యాన సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ప్రజలు మద్దత్తు తెలిపి, సుమారు 400 మంది సంతకాలు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి పైల దేవదాసురెడ్డి, ఎంపిటిసి బి.విశ్వనాథం పాల్గొని సహకారం అందజేశారు.


దుప్పట్లను పంపిణీ చేస్తున్న దుర్గారావు

## హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

**పలాస:** కాశీబుగ్గ బిసి సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవడానికి గ్రామీణ ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా తన సొంత నిధులు పంపిణీ చేశానన్నారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సొంత ఖర్చులతో 50 మందికి దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సంరక్షణే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. జనసేన నాయకులు దవ్వాడ వంశీ కృష్ణచౌదరి, గుజ్జ దేవరాజు, బంగారు కేదారనాథ్, ఐరోతు రామ్ పాల్గొన్నారు.

## నిర్లక్షపు నీడలో డ్రైనేజీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో తమ్మినాయుడుపేట పంచాయతీ పరిధిలో పొదలు అల్లుకుపోయిన డ్రైనేజీలు, మురికి వాసన భరించలేక ప్రజలు విలవిలలాడుతున్నారు. పంచాయతీలో ఎక్కడ చూసిన డ్రైనేజీలు మురికినీటితో అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. గ్రామంలో శానిటేషన్ పనులు చేపట్టకపోవడంతో దోమలబెడద ఎక్కువై గ్రామంలో ప్రజలు జ్వరాలు బారినపడే అవకాశాలు కనిపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో మంచినీటి ట్యాంక్ పైకప్పు పాడైపోయి నెలలు గడిచినా పట్టించుకునేనాధుడే లేరని, దూళి దుమ్ము రేగి మంచినీటి ట్యాంకులో పడటం వలన తాగునీరు ఒక్కోసారి ఎరుపురంగులో వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది చొరవచూపి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురుగుకాలువ


వాటర్ ట్యాంకుపై పాడైన పైకప్పు

## కేంద్రమంత్రిని విమర్శించడం సరికాదు

### ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుపై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని వైసిపి శ్రేణులకు ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. కొత్త రూల్స్‌పై సమస్త ప్రతినిధులతో మాట్లాడి అమలు పరుస్తున్న తీరును లిఖిత పూర్వకంగా తీసుకున్నప్పటికీ ఇండిగో సంస్థ ప్రణాళికలు తయారు చేసుకోలేక పోయిందన్నారు. పొగ మంచు సమయంలో కూడా కచ్చితత్వంతో విమానాలను ల్యాండ్ చేసే విధానాన్ని క్యాట్ 3 రన్వేల్ ఎయిట్ సిస్టం ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రానికి విభజన సమయంలో రావాల్సిన నిధులను రాబెట్టడంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎంతో కృషి చేశారని, అనేక సంస్థలను ఆంధ్రాలో ఏర్పాటు చేసేందుకు నిరంతరం పనిచేశారని, నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రిపై వైసిపి నాయకులు గుడివాడ అమర్నాథ్ విమర్శలు చేస్తున్నారని, వాస్తవాలు ప్రజలకు తెలుసని, గతంలో ఐటి మంత్రిగా పనిచేసిన అమర్నాథ్ పూర్తిగా విశాఖ నిర్వీర్యం చేశారని, నిరుద్యోగులను నట్టేట ముంచారని గుర్తు చేశారు. ఎన్నో విమానాశ్రయాల అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షిస్తూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి చేసి సకాలంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని, విజయవాడ, తిరుపతి వంటి విమానాశ్రయాలకు కనెక్టివిటీని పెంచారన్నారు.


ఎస్‌పి మహేశ్వరరెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న సిఐ

## ఎస్‌పిని కలిసిన కాశీబుగ్గ సిఐ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన వై.రామకృష్ణ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్‌పి సూచించారు.

## అందుబాటులో పరీక్షా పే చర్చా పోర్టల్

### జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రధానాచార్యులు గౌరీశంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ఈ నెల 1న పరీక్షా పే చర్చా కార్యక్రమం ప్రారంభమైందని, జనవరి 11 వరకు కొనసాగుతుందని వమరవల్లి జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రధానాచార్యులు జి.గౌరీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారతదేశ ప్రధానమంత్రి ఆకాంక్షల మేరకు పరీక్షలపై చర్చ కొనసాగుతుందని అన్నారు. జిల్లాలోని 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు https://innovateindia.my.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేయించవలెనని కోరారు. ఇందులో భాగంగా జిల్లాకు నోడల్ అధికారిగా డిఇఒ ఎ.రవిబాబు, జిల్లా కో-ఆర్డినేటర్ జి.ఇందువదనలను నియమించినట్లు చెప్పారు. ఫోన్ నంబరు 7093635234ను సంప్రదించాలన్నారు. రోజూ తక్కువ నమోదు అవుతున్న పాఠశాలలను పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో అన్ని యాజమాన్యాల జిల్లా పరిషత్ పాఠశాలలు, ప్రభుత్వ మునిసిపల్, కెజిబివి, మోడల్, రెసిడెన్షియల్, ప్రైవేట్, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్, ఎయిడెడ్ పాఠశాలలు, సిబిఎస్ఇ, ఐసిఎస్ ఈ పాఠశాలల విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జిల్లాలో ప్రిన్సిపాళ్లు, ఎంఇఒ, హెచ్‌ఒలు, సమగ్ర శిక్ష సిబ్బంది, డైట్ సిబ్బంది అందరూ తగిన శ్రద్ధ తీసుకొని అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ పరీక్షా పే చర్చా-2026 పోర్టల్‌లో నమోదు చేయించి జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి తమవంతు కృషి చేయాలన్నారు.


సురేష్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

## ఘనంగా సురేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- లావేరు

లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టిడిపి జోనల్ కో-ఆర్డినేటర్ పి. శ్రీనివాసరెడ్డి సురేష్‌కు ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసిలు పి.మధుబాబు, అర్.ప్రకాశరావు పుష్పగుచ్ఛం అందించి శుభాకంక్షలు తెలిపారు. పలుచోట్ల రోగులకు పళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పలు అనాధ శరణాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో బుడతవలస ఎంపిటిసి ముల్లు శ్రీనివాసరావు, గొర్లె శ్రీనివాసరావు, నడిమింటి చార్లెస్, దారపురెడ్డి కూర్మారావు, ముప్పిడి మురళీమోహన్, మజ్జి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యాచరణపై సమీక్ష


సమీక్షిస్తున్న ఎంపిడిఒ త్రినాథ్

**కవిటి:** కొత్తగా విధుల్లో చేరిన మండల గ్రామ సచివాలయ అధికారి బివిఎస్ రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్.త్రినాథ్ త్రినాథ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గ్రామ సచివాలయాల ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రస్తుత స్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు పనితీరును మెరుగుపర్చాలని, ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, మండల ఎఒ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు

## ఐక్యపోరాటాలతోనే పలాస జిల్లా సాధ్యం


మాట్లాడుతున్న సాధన కమిటీ సభ్యులు

**పలాస :** ఐక్యపోరాటాలతోనే పలాస జిల్లాను సాధించుకుందామని, జిల్లా ఆవశ్యకతపై ఇంటింటా ప్రచారాలు నిర్వహించడానికి సమాయత్తం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ రోడ్డులో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ అధ్యక్షతన పలాస జిల్లా సాధన కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నీ వనరులు ఉన్నా జిల్లాగా ప్రకటించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాగా ప్రకటిస్తారని అంతా ఆశించారని, చివరకు జిల్లాలు ప్రకటనలో పలాస లేకపోవడం బాధాకరమని అన్నారు. జిల్లాగా పలాస ఏర్పడితే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం జిల్లా సాధన కమిటీ కన్వీనరుగా దువ్వాడ శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో చాపర సుందరలాల్, కె.రవికుమార్, కుమార్నాయక్, ఎం.వినోద్‌కుమార్, పాలవలస వైకుంఠరావు, తంగుడు వీర్రాజు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు


మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- నరసన్నపేట

మాదకద్రవ్యాలు జోలికి వెళ్లకుండా ప్రతిఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ఈగల్ క్లబ్ మండల కో-ఆర్డినేటర్ సురవరపు సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల డ్రగ్స్ వినియోగంవల్ల కలిగే నష్టాలపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మండలంలోని వివిధ జూనియర్ కళాశాలలకు చెందిన ఈగల్ క్లబ్ కో-ఆర్డినేటర్లు హాజరు కాగా, విద్యార్థులతో పాటు వారికీ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. తెలిసీ, తెలియని వయసులో యువత మాదక ద్రవ్యాలకు బానిస కావడం, దళారుల ద్వారా అక్రమ వ్యాపారంలో చిక్కుకుపోవడం, కఠినమైన నిబంధనల కారణంగా జైలుశిక్ష పడుతుందని, డ్రగ్స్ వల్ల భవిష్యత్ అంధకారమం అవుతుందని సూచించారు. జికె కళాశాల ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల అధ్యాపకులు నాగకుమారి, వదనగిరి, రాంప్రసాద్, తామరాపల్లి ఆంగ్ల అధ్యాపకురాలు బోని భవాని ఇతర కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.


యూరియా పంపిణీ చేస్తున్న భానోజీరావు

## యూరియా పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం పంచాయతీ బండిపాలెం రైతుభరోసా కేంద్రంలో అర్హులైన రైతులకు సోమవారం యూరియాను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరైన సమయంలో వారి అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ మురళీమోహన్, వల్ల రమణ, హరి, వార్డు మెంబర్లు లంక రామారావు, లంక రమణ, కరిమజ్జి రమణయ్య, మీసాల చినసత్యం, అప్పలనాయుడు, జనార్ధన, పంపురెడ్డి అప్పలనాయుడు, చంటి, అగ్రికల్చరల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న విప్ అశోక్

## ఆపదలో ఆదుకునేందుకే సహాయనిధి

ప్రజాశక్తి- కవిటి

బడుగు, బలహీన వర్గాలను ఆపదలో ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పడుతుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను విప్ అశోక్ సోమవారం అందించారు. కవిటి మండలం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐదుగురికి రూ.3,21,061ల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్రప్రకాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, జడ్ఆర్‌యుసిసి సభ్యుడు శ్రీనివాస్ రౌళో, బాసుదేవ్ రౌళో, బీమా రౌలో పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

## సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో కాశీబుగ్గ సిఐ వై.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సిఐను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ రామ్‌నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, తెలుగు యువత మండల అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, పిఎసిఎస్ డైరెక్టర్ రఘు పాత్రుని సుధాకర్, కొర్రాయి మంత్ర, బమ్మిడి ఆనంద్ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి గాయత్రి

## భగవాన్‌పురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో భగవాన్‌పురంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. విషయం తెలుసుకున్న కె.కొత్తూరు పిహెచ్‌సి వైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యాన సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ మేరీ కేథరిన్ సందర్శించారు. ఈ ఏడాది సెప్టెంబరులో పక్క గ్రామం చింతలగారలో విషజ్వరాలు కలకలం రేపాయి.

## క్రీడాకారులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

**నందిగాం:** మండలంలోని లక్ష్మీదాసుపురంలో ఇటీవల నిర్వహించిన టెక్కలి నియోజకవర్గం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పెద్దతామరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం అభినందించారు. జూనియర్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో వనమాలి ఢిల్లేశ్వరి పదో తరగతి ప్రథమ స్థానం త్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, 1500 మీటర్లలో తృతీయ స్థానం సాధించి వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సాధించారు. పదో తరగతి విద్యార్థి మాధు కేశవరావు 800 మీటర్లు, త్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానం సాధించారు. జీరు జస్వంత్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం హైజంపులో ద్వితీయ స్థానం సాధించారు. మండల జనార్ధన హైజంప్‌లో తృతీయ స్థానం గెలుపొందారు. వివిధ పోటీల్లో పథకాల సాధించిన క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎస్.వైకుంఠరావు, ప్రధానోపాధ్యాయులు బి.నాగమణి విద్యార్థులను అభినందించి ప్రశంసించారు.

## పంచాయతీరాజ్ శాఖలో సమూల మార్పులు


మాట్లాడుతున్న చంద్ర మోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉంటూ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించిన విధానం కచ్చితంగా ఆమోదయోగ్యం, పారదర్శ కంగా ఉందని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఏ ఉద్యోగి అయినా తనస్థాయి పెంచుకుంటూ వెళ్లాలనుకుంటాడని, అటువంటిది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఉద్యోగులు ఏళ్ల తరబడి ప్రమోషన్లు లేక నిరాశలో ఉండి పోయారన్నారు. ఇప్పుడు. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికి పదోన్నతులు లభిస్తున్నాయని అన్నారు. గతంలో ఏ స్థాయిలో ఉద్యోగంలో చేరారో, అదే స్థాయిలో పదవీ విరమణ పొందిన సందర్భాలుండేవని, ఇప్పుడు పవన్ కల్యాణ్ దానిని తిరగరాశారన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పాత్రుని పాపారావు, భూపతి అర్జున్‌కుమార్, కూరాకుల మాధవ్, చిట్టి భాస్కరరావు, మెట్ట అవినాష్, కీర్తి సుశీల పాల్గొన్నారు.

## శిథిల భవనం తొలగించాలి


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

దశాబ్దాల కిందట గ్రామంలో నిర్మించిన పాఠశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, తక్షణమే దాన్ని తొలగించాలని చిన్న మెళియాపుట్టుగ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ మురళీమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయంగా ఉందని అన్నారు. ప్రస్తుతం సమీపంలోని వేరే భవనంలో విద్యార్థులకు చదువు చెప్తున్నారని వారు తెలిపారు. అయితే ఆ భవనం సమీపంలోనే రోజూ చిన్నారులు ఆటలాడుకోవడంతో ఇబ్బంది మరింత ఎక్కువగా ఉందని వారు తెలిపారు. చిన్నారుల భద్రత దృష్టిలో ఉంచుకొని అధికారులు స్పందించి తక్షణమే ఆ భవనాన్ని నేలమట్టం చేయాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంపిటిసి మాజీ సభ్యులు వెంకటరమణ, ఎం.లల్లు, జి.అర్జున్ ఉన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ


తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం గ్రామ పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలాస ఎడిఎ ఎం.రామారావు మాట్లాడుతూ ఎరువుల కొనుగోలు, అమ్మకం, నిల్వ రికార్డుల నిర్వహణ, గరిష్ట అమ్మకం ధర, విధానాలు భారత ప్రభుత్వ ఎరువుల నియంత్రణ ఆర్డర్ 1985 ప్రకారం అధీకృత ఎరువుల డీలర్లు అందరూ విధిగా పాటించాలన్నారు. లేనిచో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి లైసెన్స్‌లు, బస్తాల బరువు, నిల్వలు, అమ్మకం రసీదులు, ఎరువులు ఉత్పత్తి, సరఫరాదారు నుంచి అధికృత ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. గరిష్ట అమ్మకం ధరకు మాత్రమే నాణ్యమైన ఎరువులు రైతులకు అందించాలని, దీని విషయంలో స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు రైతులను విచారించాలని స్థానిక వ్యవసాయ అధికారి నరసింహమూర్తికి తెలిపారు.

## నేత్ర వైద్య శిబిరానికి స్పందన


నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి అరుణకుమారి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గరుడఖండిలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, బిసి సెల్ అధ్యక్షుడు యవ్వారి మోహనరావు మాస్టర్, పలాస మున్సిపాలిటీ 31వ వార్డు ఇన్‌ఛార్జి కొరికాన శంకరరావు, సర్పంచ్‌తో కలిసి ప్రారంభించిరు. ఇక్కడ ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా నేత్ర ఆపరేషన్ చేస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కూన అరుణకుమారి కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాసుమాన రామారావు, టిడిపి నాయకులు శాసుమాన చంద్రమౌళి, శాసుమన సంతోష్, నాని, ఇచ్ఛాపురం సీతారాం, శాసుమాన హేమచౌదరి, ఏదల్ల నాయకరావు, సత్యవతి, బర్లె కృష్ణంరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న విద్యార్థి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ జూనియర్ బాలరు కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు తెలిపారు. సోమవారం అధ్యాపకులతో కలిసి ఇంటర్ ప్రవేశాలల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒరియా మీడియం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి హరికృష్ణ బెహరా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురులో నాకు అధ్యాపకుల నాణ్యమైన బోధన, అనుభవంతో కూడిన నిరంతర పర్యవేక్షణ వల్ల మొదటి సంవత్సరంలో 441/470మార్కులు తెచ్చుకున్నానని తెలిపారు. అటువంటి అధ్యాపకుల దగ్గర మీరు కూడా చేరితే నాలాగే మంచి మార్కులు తెచ్చుకోవచ్చునని తెలిపారు. కళాశాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ మాకు నూతన ఉత్సాహం కల్పిస్తున్నారని చెప్పారు.

## గ్యాస్ వినియోగదారుల ఆందోళన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉజ్వల్ ఇండియన్ గ్రామీణ వితారక్ ఏజన్సీ నుంచి వినియోగదారులకు గత రెండు వారాలుగా వంట గ్యాస్ అందక అవస్థలు పడుతున్నారు. ముమ్మరంగా వ్యవసాయ పనులు, వరి కోతలు జరుగుతున్న తరుణంలో వంట గ్యాస్ అందకపోవడం వల్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందిగాం మండలం హరిదాసుపురం, పి.వి.పురం, పూండి పరిసర ప్రాంతాలకు ఆ ఏజన్సీ నుంచే గ్యాస్ అందాల్సి ఉంది. కానీ, అందించడంలేదని వినియోగదారులు అరుణ, పోలమ్మ, నారాయణమ్మ తదితరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చినా వేళాపాలా లేకుండా రావడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. హెచ్‌పి గ్యాస్ ఏజన్సీ నుంచి వారానికి మూడు సార్లు పంపిణీ చేస్తున్నారని, కానీ ఇండియన్ గ్యాస్ నుంచి మాత్రం అలా పంపిణీ కావడం లేదని చెబుతున్నారు. సకాలంలో ప్రతి వారమూ గ్యాస్ సిలండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## ఘనంగా మేరీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమాజంలో వివిధ మతాల దైవాలు వేరైనప్పటికీ ధర్మం పాటించడమే సర్వమత సారాంశమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పాత ఆమదాలవలస చర్చిలో పాస్టర్ రాడ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేరీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆమదావలస మండలం, మున్సిపాలిటీకి చెందిన 40 మంది సంఘ సేవకులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

## గ్రామగ్రామాన జెండర్ ర్యాలీ

**మందస:** మండలంలోని గ్రామ గ్రామాన మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి జెండర్ ర్యాలీలు నిర్వహించాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని బాలిగాం పంచాయతీ వీరభద్ర, అంబుగాం పంచాయతీ బొడ్లూరు, నారాయణపురం గ్రామాల్లో జండర్ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయస్థాయిలో నేషనల్ రూరల్ లైవ్ లీవుడ్ మిషన్, రాష్ట్రస్థాయిలో సెర్ప్ సూచనల మేరకు వికసిత గ్రామీణ భారత్ దిశగా మహిళా సమ్మిళిత సామాజిక అభివృద్ధి, ఆర్థిక సాధికారతకు ముందడుగు వేస్తుందని అన్నారు. మండల మహిళా సమాఖ్య ప్రతి నిధులు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు మంగమ్మ, మీనాక్షి, ముఖ లింగం, విఒఎలు మోహిని, చంద్రావతి, మహాలక్ష్మి, లోలాక్షి పాల్గొన్నారు.

## రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

**వజ్రపుకొత్తూరు:** మండలంలోని దేవునల్తాడలో బుదవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు ఒక ప్రకటనలో కోరారు. శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి సౌజన్యంతో దేవునల్తాడ గ్రంథాలయం ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఉద్యోగులు ఇహెచ్ఎస్ కార్డును శిబిరానికి తీసుకురావాలని కోరారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి- నరసన్నపేట

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. నరసన్నపేట కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడైన మురమళ్ల చిట్టిప్రసాద్, నరసింహమూర్తిలకు రూ.2,500 జరిమానా విధించారు. అలాగే ఓపెన్ డ్రింకింగ్ కేసులో నిందితులైన పిడూరి శ్రీనివాసరావు, చీపురు ప్రతాప్, ధర్మాన సింహాచలం, కేవిటి సోమేశ్వరరావు, గురువెల్లి ఢిలేశ్వరరావు, మంగ కృష్ణ, దుర్వి దాసయ్యలకు రూ.600 చొప్పున జరిమానా విధించారు.

## తాగునీరు సరఫరా

**టెక్కలి రూరల్ :** టెక్కలి మేజర్ పంచాయతీలో కుళాయిలు ద్వారా అందించే తాగునీటి సరఫరా సోమవారం ఆగిపోయింది. స్థానిక ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత తాగునీటి ప్రాజెక్టు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌పైన ఉండే సీటీ బాక్స్, జంపర్లు, కేబుల్ వైర్లు కాలిపోవడంతో ట్యాంకులకు నీరు వెళ్లకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో తాగునీటి సరఫరా పునరుద్ధరణకు తక్షణ మరమ్మతులు చేపట్టారు. అనంతరం తాగునీటిని సరఫరా చేశారు.

## టార్పాలిన్లు పంపిణీ


టార్పాలిన్లను పంపిణీ చేస్తున్న ఢిల్లీరావు

**పలాస :** కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని తెలుగు యువత మండల అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో సోమవారం రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకొనేందుకు టార్పాలిన్లు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.